ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8, కనిష్ఠం 24.6
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 14 జూలై 2024









అంచనాలతోనే.. హడావుడి!

- జిల్లాలో ఏడాదైనా అడుగుముందుకు పడని తరోడా బ్రిడ్జి నిర్మాణ పనులు
- కాలంచెల్లిన పిల్లర్లపై బెయిలీ బ్రిడ్జి నిర్మాణం ఎలా సాధ్యం?
- ఇప్పటికే నిరాల టూ ఆదిలాబాద్ రోడ్డు పనులు పూర్తి
- లోలెవల్ వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లతో ప్రతిపాదనలు
- శాశ్వత పరిష్కారం చూపని పాలకులు.. అటు అధికారులు

ఆదిలాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలో సాత్నాల వాగుపై నిర్మించిన తరోడా బ్రిడ్జి దెబ్బతినడంతో.. దాని స్థానంలో కొత్తగా మరో బిడ్జిని నిర్మించి, ఆదిలాబాద్-బేల-మహారాష్ట్రలోని రాజురా వరకు 353(బి) జాతీయ రహదారిని 33 కి.మీ.ల మేర విస్తరణ పనులకు గాను గత ప్రభుత్వ హయాం లో రూ.490 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మార్చి నెలలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన సందర్భంగా పనులను ప్రారంభించారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణం, రహదారి విస్తరణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఈ విస్తరణ పనులను మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాకు చెందిన ఆర్‌బి షెట్యే కంపెనీ దక్కించుకుంది. రోడ్డు నిర్మాణ సంస్థ సర్వే పనుల పేరిట తీవ్ర కాలయాపన చేస్తూ వస్తోంది. ఇప్పటి వరకు తట్టమన్నును ఎత్తిపోసినట్లు కనిపించడం లేదు. ఏడాది గడుస్తున్నా అంచనాలతోనే హడావుడి చేస్తున్నారే తప్ప.. పనులను ప్రారంభించేందుకు చిత్త శుద్ధి కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతేడు భారీ వర్షాలు, వరదల ఉధృతికి బ్రిడ్జి అకస్మాత్తుగా కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో అప్రమత్తమైన అధికారులు బ్రిడ్జి పైనుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా నిరాల- ఆదిలాబాద్ వరకు రూ.42లక్షల వ్యయంతో రహదారి విస్తరణ పనులను కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ మార్గం గుండానే జైనథ్, బేల మండలాలతో పాటు మహారాష్ట్రకు చెందిన ప్రయాణికులు జిల్లాకేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే తాజాగా బెయిలీ బ్రిడ్జి(ఐరన్)ను నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించడం చర్చనీయాంశంగా మారింది.

ప్రమాదమని తెలిసినా..

తరోడా బ్రిడ్జి కుంగి పోవడానికి నాణ్యత లేకపోవడమే అసలు కారణమంటూ ఆర్‌అండ్‌బి అధికారులు గతేడు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. బ్రిడ్జి పైభాగం బీటలు వారి ఓవైపునకు వంగిపోవడంతో ప్రమాదకరమని హెచ్చరిస్తూ రాకపోకలను నిలిపి వేశారు. కనీసం ద్విచక్ర వాహనాలను కూడా అనుమతించడం లేదు. బ్రిడ్జికి సంబంధించిన ఏడు పిల్లర్ల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉందని క్వాలిటి విభాగం అధికారులు గుర్తించారు. భారీ వరద ఉధృతికి పిల్లర్లలో కదలిక రావడంతోనే బ్రిడ్జికి బీటలు వారినట్లు అధికారులు చెబుతున్నారు.



దీంతో కాలం చెల్లిన పిల్లర్లపై మళ్లీ బ్రిడ్జిని పునరుద్ధరించడం కుదరదంటూ కొత్తగా ప్రతిపాదనలు రూపొందించారు. దాననుగుణంగానే నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ ఇటీవల జాతీయ రహదారుల రీజినల్ అధికారి కుష్‌వాహా తరోడా బ్రిడ్జిని సందర్శించి రూ.5 కోట్ల వ్యయంతో బెయిలీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నాణ్యత లేని పిల్లర్లపై ఐరన్ బ్రిడ్జిని నిర్మిస్తే మళ్లీ ప్రమాదమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో హడావుడిగా పనులు చేపట్టడంతోనే తరోడా బ్రిడ్జికి ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిందంటూ స్థానికులు చెబుతున్నారు. మళ్లీ అదే తప్పిదాలు చేస్తే కోట్ల రూపాయల నిధులు వరద పాలయ్యే అవకాశం ఉందంటున్నారు. కొత్తగా మంజూరైన బ్రిడ్జి నిర్మాణం పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాల్సిన అధికారులు, పాలకులు ఆగమేఘాల మీద బెయిలీ బ్రిడ్జి నిర్మాణాన్ని తెరపైకి తేవడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా ప్రమాదమని తెలిసినా ఆర్‌అండ్‌బీ అధికారులు నోరు మెదుపక పోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ప్రత్యామ్నాయ మార్గం ఉన్నా..

తరోడా వద్ద బ్రిడ్జి కుంగిపోవడంతో గత ప్రభుత్వం హుటాహుటిన రూ.42 కోట్ల నిధులను మంజూరు చేసి జైనథ్ మండలంలోని నిరాల నుంచి అడ, లాండసాంగి గ్రామాల మీదుగా సుమారుగా 16కి.మీ.ల మేర రోడ్డు విస్తరణ పనులను దాదాపుగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఈమార్గం గుండానే రాకపోకలు సాగుతున్నాయి. కొంత దూరభారమవుతుందన్న ఉద్దేశ్యంతో కొత్తగా బ్రిడ్జిని నిర్మించేందుకు నిధులను మంజూరు చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాడు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు హెచ్చరించక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికీ క్యాంపును కూడా ఏర్పాటు చేసిన పరిస్థితులు కనిపించడం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థమే నిరాల- ఆదిలాబాద్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి.. ఏడాది తర్వాత కొత్తగా ఐరన్ బ్రిడ్జి నిర్మాణాన్ని తెరపైకి తేవడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అప్పట్లోనే ఐరన్ బ్రిడ్జి నిర్మించి ఉంటే ఇబ్బందులు ఉండేవి కావన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

మరో రెండేళ్లు ఆగాల్సిందే..

తరోడా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల పాటు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి సమీపంలోనే లోలెవల్ వంతెనను నిర్మించేందుకు రూ.4.50 కోట్ల నిధులతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాత్కాలికంగా నిర్మించిన బ్రిడ్జి ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుక పోవడంతో మళ్లీ దాని స్థానంలో లోలెవల్ బ్రిడ్జిని నిర్మించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. 49 పైపులను ఏర్పాటు చేసి లోలెవల్ బ్రిడ్జిని నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉండడంతో అప్పటి వరకు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా లోలెవల్ బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు. దీంతో పాటు ఐరన్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అయితే అప్పుడే ఐరన్ బ్రిడ్జిని నిర్మించి ఉంటే ఇబ్బందులు తప్పేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పనులు పూర్తయ్యేందుకు రెండేళ్ల గడువు ఉంది

: సుభాష్, నేషనల్ హైవే డీఈ

ఆదిలాబాద్-బేల-రాజురా వరకు చేపట్టే రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసేందుకు రెండేళ్ల వరకు గడువు ఉంది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. బెయిలీ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అలాగే బ్రిడ్జి సమీపంలోనే లోలెవల్ వంతెనను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రత్యామ్నాయంగా నిరాల నుంచి ఆదిలాబాద్ వరకు రోడ్డు విస్తరణ పనులుపూర్తయ్యే దశకు చేరుకున్నాయి.

సంక్షిప్త సమాచారం



కౌటా(బి)లో ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న పీరీలు

గ్రామాల్లో మొహరం ఉత్సవాలు

బోథ్, జూలై 13: మండలంలో కులమతాలకు అతీతంగా మొహరం పండుగ ఉత్సవాలను జరుపుకుంటారు. అయితే పండుగ వేడుకలలో ఊరేగించే పీరీలను ఆయా గ్రామాల్లో సిద్ధం చేశారు. వారం రోజుల పాటు గ్రామాలలో పండుగ వేడుకలకు జరుపుకోవడం ఆనవాయితీ. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాత్రులలో పీర్ల ఊరేగింపు ఉంటుంది. బుధవారం మలీదల పేరుతో బోనాలు వేస్తారు. గురువారం రోజంతా పీర్ల ఊరేగింపు ఉంటుంది. భారీ సంఖ్యలో ఆయా గ్రామాల్లో ప్రజలు ఉత్సవాల్లో పాల్గొంటారు.

టీచర్‌కు ఆత్మీయ సన్మానం

ఉట్నూర్, జూలై 13: మండలంలోని ఎంకా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 9ఏళ్ల పాటు విధులు నిర్వహించి, విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఉపాధ్యాయుడు గణేష్‌రాథోడ్‌కు గ్రామస్థులు విద్యార్థులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. శనివారం ఎంకా పాఠశాల నుంచి నార్నూర్ మండలంలోని తడిహత్నూర్‌కు బదిలీపై వెళ్తున్న టీచర్ గణేష్‌రాథోడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల ప రిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు రషీద్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాథోడ్ గణేష్ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు విజయ, నారాయణ, రామారావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామప్రజలు, మహిళలు, ఉపాధ్యాయులు ధర్మేందర్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం!!

ఇచ్చోడ, జూలై, 13: ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయితీ పారిశుధ్య సిబ్బంది చెత్త తరలింపులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ట్రాక్టర్‌లో చెత్త నింపి పైన ఎలాంటి పరదా లేకుండా ఇచ్చోడ మండలంలోని బాబుల్‌జోలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఇచ్చోడ-ఆదిలాబాద్ ప్రధాన జాతీయ రహదారిపై కనీస నిబంధనలు పాటించకుండా చెత్తను తరలిస్తుండడంతో అది గాలికి ఎగిరొచ్చి పడుతుండడతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టింపు చేసుకుని స్పందించి చెత్త తరలింపు ప్రజా జీవనానికి ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



ట్రాలీపై ఎలాంటి పరదా లేకుండానే చెత్తను తరలిస్తున్న దృశ్యం

జిల్లావ్యాప్తంగా మోస్తారు వర్షం

● జిల్లాకేంద్రంతో పాటు పలు మండలాల్లో సాయంత్రం వేళ కురిసిన వర్షం ● మరోవైపు వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం



వర్షానికి కూలిన సిరిచెల్మ మల్లన్న ఆలయం ప్రహరీ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 13: జిల్లాలో శనివారం సాయంత్రం వేళ ఓ మోస్తారు వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో వర్షం కురసింది. సాయంత్రం సమయంలో ఒక్కసారి వాతావరణం చల్లబడింది. దీంతో చల్లని ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మరోవైపు జోరుగా వ్యవసాయ పనులు సాగుతున్న సమయంలో భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

● వర్షానికి కూలిన ఆలయం ప్రహరీ

ఇచ్చోడ: జిల్లాలోనే ఎంతో విశిష్టత కలిగిన అతిపురాతన ఆలయం సిరిచెల్మ మల్లికార్జున ఆలయ ప్రహరీ శుక్రవారం రాత్రి కూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణాంగా ఆలయం వెనుకవైపు గల గోడ కూలింది. ఎంతో ప్రశస్తి కలిగిన, అనేక ప్రాంతాల నుంచి వెరే రాష్ట్రాల నుంచి భక్తులు దర్శించుకునే ఆలయం నిర్వహణ పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం గురించి స్థానికులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. పట్టించుకోలేదని, అధికారులు తక్షణమే స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ఆలయ భక్తులు కోరుతున్నారు. ఆలయానికి కుడివైపు ఉన్న ప్రహరీ పూర్తిగా పగుళ్ల తెలి కూలి పోయే స్థితికి చేరింది. చుట్టు చెరువు.. మధ్యలో మల్లన్న.. భక్తుల కొంగు బంగారం మల్లన్న అని.. అలాంటి చారిత్రాక కట్టడమైన ఈ ఆలయం పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

తాంసిలో పిడుగుపాటుతో 12 మేకల మృత్యువాత

తాంసి, జూలై 13: మండల కేంద్రంలో పిడుగుపాటుకు 12 మేకలు మృతి చెందాయి. వివరాల ప్రకారం శనివారం రోజున మండల కేంద్రానికి చెందిన రాగి కిష్టుకు చెందిన పది మేకలు, పెద్దపల్లి రాములుకు చెందిన రెండు మేకలు పిడుగు పడి మృతి చెందాయి. ఎప్పటి లాగే తమ మేకలను మేపడానికి బోడగుట్ట సమీపానికి వెళ్లారు. శనివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో భారీ వర్షం కురియడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకి మేకల మందను నిలుచోబెట్టి వీళ్ల ఇద్దరు మరో చెట్టు కింద నీలుచున్నారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో మేకల మంద ఉన్న చెట్టుపై పడటంతో 12 మేకలు మృత్యువాత పడ్డాయి. అంతేకాకుండా ఈ ఘటనలో మరికొన్ని మేకలు సైతం స్వల్ప గాయాలతో బయటపడ్డాయి. మృతి చెందిన మేకల విలువ దాదాపు లక్షా 70 వేల రూపాయల వరకు ఉంటుందని మేకల యజమానులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలతోనే రైతు అభిప్రాయ సేకరణ

● మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపణ

ఆదిలాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలతోనే రైతు అభిప్రాయ సేకరణ చేపట్టిందంటూ మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసాపై ఆంక్షలు లేవంటూనే ప్రభుత్వం అభిప్రాయాలను సేకరించడం ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చినట్లే అందరికి రైతుబంధును ఇవ్వాలన్నారు. కేవలం కాలయాపన చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంభిస్తుందన్నారు. ముందుగానే అధికారులు రైతుల అభిప్రాయ సేకరణ పై జాబితాను తయారు చేయడం ఏమిటన్నారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో తలుపులు మూసి పోలీసుల బందోబస్తు మధ్య రైతు అభిప్రాయ సేకరణ చేశారని ఆరోపించారు. వందలాది మంది అసలైన రైతులను అనుమతించక పోవడంతో నిరాశగా వెనుదిరుగడం జరిగిందన్నారు. అసలు రేవంత్‌రెడ్డి ఉంటాడా ఊడిపోతాడా అనే భయంతో రైతు అభిప్రాయ సేకరణ చేస్తున్నారని విమర్శించారు. పంటలు వేసి నెల రోజులు గడిచి పోతున్న ఇప్పటికీ పెట్టుబడి సహాయాన్ని అందించిన దాఖలాలు లేవన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. రైతు కూలీలకు మోసం చేస్తున్నారని ఇప్పటి వరకు ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేదన్నారు. వెంటనే డీఎస్సీ గ్రూపు-2ను వాయిదా వేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్, సాజిదొద్దిన్, అష్రఫ్, వేణుగోపాల్ యాదవ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



హాజరైన ఆయా శాఖల అధికారులు

శాఖల వారీగా వివరాలు అందించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూలై 13: ప్రజాపాలన, దరణి, వ్యవసాయ, వైద్యం, వన మహోత్సవం, మహిళ శక్తి, విద్య, యాంటీడ్రగ్స్, లాఅండ్ ఆర్డర్ పై శనివారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా వివరాలు, పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, రిమ్స్ డైరెక్టర్, వైద్యాధికారి, డీఈవో, సివిల్ సప్లయి, హార్టికల్చర్, ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

● పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు


ఆదిలాబాద్ రూరల్, జులై 13: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 317 జీవో బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సబ్ కమిటీ సభ్యులు ఇచ్చిన నివేదిక ప్రకారం అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వం న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సభ్యులు వారి సమస్యలను వినతిపత్రం రూపంలో వివరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్, సంఘం సభ్యులు ప్రకాష్ మోహన్, రాజు, బాబన్న, తదితరులున్నారు.

ప్రతిరోజూ పైప్‌లైన్‌ను తవ్వాల్సిందేనా?!

బోథ్, జూలై 13: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన తాగునీ పైప్‌లైన్‌లు ప్రతీరోజు ఎక్కడో ఒకచోట పగిలి పోతుండటంతో గ్రామ పంచాయతీ కూలీలు ఎక్కడో ఒకచోట తవ్వాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీనిలో భాగంగా పాత కోర్టు భవనం సమీపంలో ఉన్న మురికి కాలువపైన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో పైప్‌లైన్ పగిలిపోయి పంచాయతీ సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా మండలకేంద్రంలోని మరికొన్ని కాలనీలలో సైతం తాగునీటి పైప్‌లైన్‌లు పైనే ఉండటంతో భారీ వాహనాలు తిరగడం వల్ల పైప్‌లైన్‌లు పగిలిపోతున్నాయి. దీంతో సంబంధిత అధికారులు, సిబ్బందికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు.




పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్వుతున్న కూలీలు



'పురోహితుడి సేవలు చిరస్మరనీయం'

భోథ్, జూలై 13: మండల కేంద్రానికి చెందిన పురోహితుడు దొనగిరి శంకర్ (70) శనివారం ఉదయం మృతిచెందారు. వెంకటేశ్వర ఆలయ పురోహితుడిగా 50 సంవత్సరాలు సేవలందించారు. ఈయన సేవలు చిరస్మరణీయమని స్థానికులు పేర్కొంటున్నారు.






ఆకర్షణీయంగా బోథ్ ఠాణా

భోథ్, జూలై 13: బోథ్ పోలీస్‌స్టేషన్‌ను అధికారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. గత 12 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రికార్డులను క్రమపద్ధతిలో పెట్టడంతో పాటు ఇటీవలస్టేషన్‌కు వివిధ రకాల రంగులు వేసి ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. స్టేషన్‌లో ఉన్న చెత్తా చెదారం తొలగించి ఆవరణలో అందమైన మొక్కలను ఆకర్షణీయంగా పెంచుతున్నారు. స్టేషన్‌లో గతంలో ఏర్పాటు చేసిన పార్కు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీంతో వివిధ కేసుల్లో ఇరుక్కొని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరుతున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ మొత్తంలో వివిధ రకాల మొక్కలు ఉండటంతో స్టేషన్‌కు వచ్చిన వారు మొక్కలను పరిశీలనగా చూస్తున్నారు.








లోటు వర్షపాతంతో రైతుల దిగాలు

భోథ్, జూలై 13: మండలంలో ఈ ఏడాది లోటు వర్షపాతమే నమోదైంది. ప్రతిసంవత్సరం జూలై నెలలో అధిక వర్షాలు కురిసేవి. అయితే ప్రస్తుతం జూలై మాసం సగం పూర్తికావస్తున్నా మండలంలో మాత్రం లోటు వర్షపాతమే కనిపిస్తుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది 55 శాతం లోటుగా ఉందని అధికారులు తెలిపారు. వాస్తవానికి 277.8 మిల్లీమీటర్ల వర్షపాతం. సాధారణ వర్షపాతం కాగా ఇప్పటి వరకు 218.6 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే 20 శాతం లోటు వర్షపాతం ఉందని లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోయాయి. ఫలితంగా మండలంలోని అనేక గ్రామాల్లో జలాలకు గండం ఉందని రైతులంటున్నారు. అయితే అడపా దడపా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు అనుకూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు వర్షాల వల్ల పంటల పెరుగుదల ఆశించిన రీతిలో ఉందని మరో రెండు రోజులు వర్షాలు కురవకపోతే పంటలకు నష్టం వాటిల్లి ఆస్కారం ఉందని అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగులో రైతులకు మొదటల్లోనే ఇబ్బందులు తలెత్తాయి. నాటిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రెండేసిసార్లు విత్తనాలను నాటాల్సిన అవసరం ఏర్పడింది.


మండలంలో సాగు అవుతున్న సోయాబీన్ పంట





పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, జూలై 13: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని మాజీ సర్పంచ్‌రెడ్డి కుటుంబ సభ్యుల తో పాటు పాషాతండా గ్రామానికి చెందిన సుమిత్ర రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. అంతేకాకుండా ప్రమాద వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం నగదును అందజేశారు. ఏ సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా అండగా ఉంటానన్నారు. అనంతరం ఈస్పూర్ గ్రామానికి చెందిన సాబ్లె గోవింద్‌సింగ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, డీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ జాదవ్ గణేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లెనానక్ సింగ్, నాయకులు రమేష్‌జాదవ్, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్, గంగాసింగ్, తదితరులు పాల్గొన్నారు.

● పలు గ్రామాల్లో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని ఇస్పూర్, రాజురా గ్రామాల్లో బోథ్ శాసన సభ్యుడు అనిల్‌జాదవ్ శనివారం పర్యటించారు. దీనిలో భాగంగా గ్రామంలో జరుగుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా ఇటీవల నూతనంగా నిర్మించిన లోలెవల్ బ్రిడ్జిను పరిశీలించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పలు అంశాలపై గ్రామస్థులతో చర్చించారు. వీరి వెంట మాజీ ఎంపీపీ సజన్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ గణేష్, పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, గులాబ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు జింక బలి?

మావల, జూలై 13: మావల అటవీ సమీపంలో ఓ జింక వేటగాళ్ల ఉచ్చుకు బలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మావల చెరువులో ఓ జింక కళేబారం దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అయితే రాత్రికి రాత్రే జింక కళేబరాన్ని అధికారులు దాన్ని ఖననం చేసి ఉంటారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎఫ్‌బీవో ప్రశాంత్‌ని వివరణ కోరగా.. మావల చెరువులో జింక తేలడటం జరగ లేదని, అది పాత ఫోటో అయి ఉంటదని తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతాన్ని చెరువును గాలించామని జింక ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదని ఆయన తెలిపారు.



నీటిలో తేలియాడుతున్న జింక కళేబరం

అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర

ఆదిలాబాద్ అర్బన్, జూలై 13: 'హరే రామ హరే కృష్ణ' సంకీర్తనలతో ఆదిలాబాద్ పట్టణం మార్మోగింది. జిల్లా కేంద్రంలోని మధుర జిన్నింగ్ నుంచి శనివారం శ్రీజగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఇస్కాన్ ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై యాత్రలో పాల్గొన్నారు. జగన్నాథుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో పట్టణంలో ఊరేగించారు.



ఉత్సవ విగ్రహాలు



ఆశీర్వదిస్తున్న స్వామీజీ



నృత్యాలు చేస్తున్న మహిళలు



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

అపోహలు వద్దు..

సకాలంలో పథకాలు పూర్తి చేస్తాం

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త ● కొమురంభీం ప్రాంగణంలో జన్ మాన్ పథకంపై సమావేశం ● పాల్గొన్న గిరిజనులు, ఆయా సంఘాల నాయకులు

ఉట్నూర్, జూలై 13: ప్రధానమంత్రి జన జాతీయ న్యాయ మహా అభియాన్ పథకాన్ని సకాలంలో పూర్తి చేస్తామని, ఎలాంటి అపోహలకు గురికావద్దని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. శుక్రవారం రాత్రి పీవీటీజీ సంఘాల నాయకులకు ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో పీవీటీజీ సంఘాల నాయకులతో, గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో పథకం అర్హులైన లబ్ధిదారులకు జన్‌మాన్ పథకం ద్వారా ఒక్కొక్క జిల్లాకు పీవీటీజీ గ్రామాలకు ఐదు చొప్పున అంబులెన్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్టాఫ్ నర్సులను నియమించడం జరిగిందన్నారు. విద్యుత్‌కోసం ప్రత్యేక దృష్టి సారించి సోలార్లు ఏర్పాటు చేశామన్నారు నీటి సౌకర్యంలేని జైనూర్, నార్నూర్ మండలాల్లోని పీవీటీజీ గ్రామాలను గుర్తించి వాటర్ ట్యాంకర్లు అందించామన్నారు. జన్‌మాన్ ద్వారా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఏజెన్సీ కార్యాలయం ద్వారా పీవీటీజీ గ్రామాలలో డెంగ్యూ, మలేరియా గర్భిణులకు స్క్రీనింగ్ చేయించడం కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నైపుణ్య అభివృద్ధి సంస్థలో ఉమ్మడి జిల్లాలో శిక్షణలు కలిపించి విద్యార్థులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించడం జరుగుతుందని, అదే విధంగా ఆదిమ గిరిజనులకు పూర్వం లాగే కావాల్సిన హైబ్రిడ్ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆకుకూరల విత్తనాలు, కూరగాయల మొక్కలు కావాల్సిన వారు హార్టికల్చర్ అధికారి వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మునగ మొక్కలు సాగు చేయడం వల్ల గర్భిణులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పెంచికల్ పేట్‌లో కొబ్బరి సాగు శిక్షణ పరిశ్రమను ఏర్పాటు చేయడం జరిగిందని ఆసక్తి గల విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందవచ్చని అన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గల హార్టికల్చర్ సంస్థ ద్వారా పూలమొక్కలు, పండ్ల మొక్కలు అందించడం జరుగుతుందని, ఆయిల్ పాం, తేనెటీగల పెంపకం, పౌల్ట్రీఫాం పెంపకంల ద్వారా ప్రత్యామ్నాయ ఆదాయం ఆదిమ గిరిజన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా పీవీటీజీ నాయకుల నుంచి జన్‌మాన్ పథకం ద్వారా ఇంకేమైనా అభివృద్ధి కోసం కావాల్సిన సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుడిమెత మనోహర్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం తదితర పీవీటీజీ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త



హాజరైన పీవీటీజీ సంఘాల నాయకులు, గిరిజనులు



నాగపూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

'వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

బోథ్, జూలై 13: మండలంలోని మారుమూల నాగపూర్ గ్రామంలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం తీరు ఆక్షేపనీయం : లంబాడి జేఏసీ

ఉట్నూర్, జూలై 13: దివంగత గిరిజన నాయకుడు, రెండుసార్లు ఖానాపూర్ ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, పార్లమెంట్ సభ్యుడిగా, వివిధ హోదాలలో పని చేసిన రాథోడ్ రమేష్ అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించక పోవడంతో పాటు గురువారం ఉట్నూర్‌లో నిర్వహించిన పెద్దకర్మ (తెరవి) కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాకపోవడం ఆక్షేపనీయమని లంబాడీ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. గురువారం రైతు భరోసా కార్యక్రమం నిర్వహించిన కొమురంభీం ప్రాంగణానికి సమీపంలో రైతుభరోసా కార్యక్రమాన్ని నిర్వహించిన ఉప సంఘం మంత్రులు, ఉప ముఖ్యమంత్రి కూత వేటు దూరంలో ఉన్న పూలాజీబాబా పాఠశాలలో (తెరవి) పెద్దకర్మ నిర్వహిస్తున్న క్రమంలో అక్కడికి రాకపోవడం చాలా శోచనీయం అన్నారు. గిరిజనుల పట్ల గిరిజన నాయకుల పట్ల కనీస గౌరవం ఇవ్వక పోవడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నామన్నారు. అధికార పార్టీ మంత్రుల తీరు చాలా బాధకరమని వారు పేర్కొన్నారు. ఇందులో లంబాడి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ నాయక్, ఆడే సురేష్, పవర్ దేవిదాస్, పవర్‌గణేష్, బీమ్‌రావు, రామారావు, సంతోష్, రామ్ మహరాజ్, రాంజీ, రాథోడ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత!

బజార్‌హత్నూర్, జూలై 13: మండలకేంద్రంలోని అపరిచిత వ్యక్తి నుంచి శనివారం గుట్టుచప్పుడు కాకుండా పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లుగా స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే.. బజార్‌హత్నూర్ గ్రామంలోని ఒక అపరిచిత వ్యక్తి నుంచి నిషేధిత గంజాయిని పోలీసులు స్వాదీన పరుచుకున్నట్లు సమాచారం. ఇదే విషయంపై బోథ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌ను వివరణ కోరగా.. కేవలం వంద గ్రాములు మాత్రమే దొరికిందని, పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామని, దీనికి సంబంధించి తర్వాత పూర్తి వివరాలను వెళ్లడిస్తామని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న డా. బందెల నరేష్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ముధోల్, జూలై 13 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని భైంసా పిల్లల వైద్య నిపుణులు డా. బందెల నరేష్ సూచించారు. శనివారం ముధోల్‌లోని ఒక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధుల జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అన్నం తనే ముందు చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి కాచి వడపోసిన నీటిని తీసుకోవడం మంచిదని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పిల్లలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు తదితర విషయాల గురించి తెలిపారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

● ఖానాపూర్‌లో ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



సెల్ టవర్ కోసం తవ్వుతున్న గుంతను అడ్డుకుంటున్న స్థానికులు

ఖానాపూర్, జూలై 13 : జనావాసాల మధ్య సెల్ టవర్‌ను ఏర్పాటు చేయవద్దని పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక అంబేద్కర్ నగర్ కాలనీ శివారులో ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేట్ నెట్వర్క్ సంస్థకు సంబంధించిన సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూమి యజమానితో గొడవకు దిగారు. ఇళ్ల నడుమనే సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరుగుతుండగా పోలీసులు రావడంతో వివాదం సద్దుమణిగింది.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

కుంటాల, జూలై, 13: కుంటాల మండలంలోని కల్లూర్ గ్రామంలో శనివారం సీఐ నైలు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ముఖ్యంగా నంబరు ప్లేటు లేని వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. అంతేగాకుండా ద్విచక్రవాహన చోదకులు అన్ని రకాల వాహన పత్రాలతో పాటు లైసెన్సు కలిగి ఉండి హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా వాహన పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై రజనీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో జోరుగా వన మహోత్సవం



భైంసాలో మొక్కలు నాటుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్, పోలీసు అధికారులు

భైంసా, జూలై 13 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలో పోలీసుశాఖ వనమహోత్సవ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తోంది. శనివారం టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఇక్కడి పోలీసు క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో వనమహోత్సవములో భాగంగా జోరుగా మొక్కలు నాటారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ రాజారెడ్డి, ఎస్ఐ షరీఫ్, ఆర్ఐ వసంత్‌రావ్, ఆర్ఎస్ఐ గణేష్‌ల సారథ్యంలో పట్టణ పోలీసులు, 7వ బెటాలియన్ పోలీసులు సామూహికంగా వివిధ రకాల మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ అవినాష్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒకరూ మొక్కలు నాటి అవి చెట్లు ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం కోసం అందరూ బాధ్యతాయుతంగా పాటుపడాలని సూచించారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా పని చేయాలి'

నిర్మల్ కల్చరల్, జూలై 13 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా కృషి చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాలు గెలుచుకోవడంపై ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని రాష్ట్ర నేతలు వివరించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ, మండల, మున్సిపల్, జడ్పీ ఎన్నికల్లో విజయమే సాధనగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఈ మేరకు విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని అధిష్ఠానం సూచించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుండడాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ ఆదేశించినట్లు వివరించారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, గాదె విలాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

'త్వరలోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం'



మాట్లాడుతున్న హర్షవర్ధర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, జూలై 13 : త్వరలోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతుల తరువాత ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. బదిలీల్లో జరిగే పొరపాట్లు సవరణ, 2023 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్, సర్వీస్ రూల్స్, ఎంఈవో, జేఎల్ పదోన్నతుల కోసం కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్ డీఏలు, జీవో 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయడంతో పాటు పలు సమస్యలు సాధిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై. సాయన్న, సిహెచ్. హరిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో

శ్రీ చైతన్య నాసా విద్యార్థుల ప్రభంజనం



నిర్మల్ చైన్‌గేట్, జూలై 13 : నిర్మల్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన నాసా పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల యాజమాన్యం చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, జోనల్ ఏజీఎంలే జితేందర్, సదాశివరెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ నరేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జగతిరెడ్డి మాట్లాడుతూ... ఏడో తరగతికి చెందిన శరణ్య, కార్తికేయ, శుశృత్, గణశ్రీ, ఎనిమిదవ తరగతికి చెందిన శంతన్, అలకనంద, తొమ్మిదవ తరగతికి చెందిన రితిక్ష, సారా, పదో తరగతికి చెందిన మిన్ను, ఏడోతరగతి ఒవైస్‌పాశా ప్రథమస్థానం సాధించారని తెలిపారు.

వాహనదారులు

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



దస్తురాబాద్, జూలై 13 : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని స్థానిక పోలీసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీసులు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటోడ్రైవర్లు ఆటోలలో నిర్దేశిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. వాహనాలను పరిమిత వేగంతో నడపాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కాగితాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఇందులో పోలీసు సిబ్బంది ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఖానాపూర్, జూలై 13 : యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానం లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి సూచించారు. శనివారం కడెం మండలంలో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అలా ఇచ్చిన వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కడెం మండలంలో పలు గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నారని అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు. రాత్రి 10 దాటిన తర్వాత యువకులు రోడ్లపై తిరగవద్దని హెచ్చరించారు. తమ పిల్లలు ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను విక్రయించిన, వినియోగించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 24.8
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 14 జూలై 2024





టూరిజం స్పాట్‌గా కవ్వాల్ టైగర్ జోన్

- ఐదు సఫారీ వాహనాల ఏర్పాటు
- 20 శాతం కోర్, బఫర్ ఏరియా కేటాయింపు
- తడోబా తరహాలో యాక్షన్‌ప్లాన్
- పీపీపీ పద్ధతిలో నిర్వహణ
- ఏకో టూరిజం పేరిట ఈ రూట్‌మ్యాప్ ఖరారు

నిర్మల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని కొంత ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ కసరత్తు మొదలుపెట్టింది. తడోబా తరహాలో కవ్వాల్ టైగర్ జోన్‌ను కూడా టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దాలని తలపెట్టారు. మొత్తం నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 78వేల హెక్టార్లకు గానూ ఇందులో నుంచి 20శాతం మేర కోర్, బఫర్ ఏరియాల్లో మాత్రమే ఈ టూరిజం స్పాట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఏకో టూరిజం పేరిట డీసీఎఫ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ 20శాతం ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఈ 20శాతం కోర్, బఫర్ ఏరియాల్లో విపరీతమైన అటవీప్రాంతంతో పాటు సుందర ప్రదేశాలు, గడ్డి మైదానాలు, వన్య ప్రాణుల సంరక్షణ ఎక్కువగా ఉంటుంది. అడవిని సందర్శించేందుకు అనుకూలమైన ప్రదేశాలకు సంబంధించి ప్రత్యేక రూట్‌మ్యాప్‌ను కూడా సిద్ధం చేశారు. అలాగే సందర్శకుల కవ్వాల్ టైగర్‌జోన్‌ను చూసేందు కోసం ప్రత్యేకంగా సఫారీ వాహనాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. మొత్తం ఐదు సఫారీ వాహనాలను సమకూర్చేందుకు తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు సమకూర్చనుంది. అయితే ఈ టూరిజం స్పాట్ నిర్వహణకు పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్) కింద నిర్వహించనున్నారు. కడెం, గంగాపూర్, ఎక్బాల్‌పూర్, ఉడుంపూర్, కల్వకుంట్ల, అకొండపేట్ ప్రాంతాల్లో ఈ టూరిజం స్పాట్ పరిధిలోకి చేర్చారు. కడెం మండలంలోని ఉడుంపూర్ వద్ద గల ఐ లవ్ కవ్వాల్ లోగో ప్రాంతం నుంచి మైసంపేట్, గంగాపూర్, లక్ష్మీపూర్, తదితర ప్రాంతాలను చూసేందుకు ప్రత్యేకంగా సఫారీని ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎక్బాల్‌పూర్ వద్ద ప్రవేశ మార్గాన్ని ఏర్పాటు చేయతలపెట్టారు. దీంతో పాటు టూరిస్టుల కోసం వసతి సౌకర్యాన్ని కూడా కల్పించనున్నారు. దిమ్మదుర్తి వద్ద పన్నెండు, జన్నారం వద్ద పది చొప్పున కాటేజీలను నిర్మించాలని ప్రతిపాదించారు. అలాగే టూరిజం స్పాట్ కింద కడెం ప్రాజెక్టును కూడా కవర్ చేస్తున్నారు. కడెం ప్రాజెక్ట్‌లోని దాదాపు 550 మీటర్ల ఎత్తున గల గుట్టపైన ఇప్పటికే వాచ్ టవర్‌ను నిర్మించారు. టూరిస్టులను ఇక్కడి వరకు తీసుకువెళ్ళి కడెం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతంతో పాటు దట్టమైన అడవులను వారికి చూపించనున్నారు. ప్రస్తుతం అటవీశాఖ 50 ఎకరాల్లో ఇప్పటికే అందమైన గడ్డి మైదానాలను పెంచిన సంగతి తెలిసిందే. ఈ టూరిజం స్పాట్‌లో ఈ గడ్డి మైదానాలను కూడా చేర్చారు. మరో నెల రోజుల్లో మొత్తం ఈ టూరిజం స్పాట్‌కు సంబంధించిన పనులన్నీ పూర్తి కానున్నాయని ఆ తరువాత సందర్శకులకు అనుమతించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ రూట్‌మ్యాప్‌కు అనుగుణంగా ఇప్పటికే సఫారీ వాహనాలు తిరిగేందు కోసం రోడ్డు నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. అయితే టైగర్ కన్జర్వేషన్ ప్లాన్ పేరిట ఏకో టూరిజం కోసం ఈ యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు. అయితే ఈ టూరిజం స్పాట్ నిర్వహణ మాత్రం పీపీపీ పద్దతి కింద చేపట్టనుండగా ప్రత్యేక చెక్‌పోస్టుల వద్ద మాత్రం అటవీశాఖ ఎంట్రీ ఫీజును వసూలు చేయనుంది. కవ్వాల్ టైగర్ జోన్ విశేషాలు వివరించేందు కోసం ప్రత్యేకంగా గైడ్‌లను కూడా నియమించనున్నారు.


కడెం ప్రాజెక్టులో పర్యాటకుల బోటింగ్ షికారు

20 శాతం కోర్, బఫర్ ఏరియా కేటాయింపు

కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని 80వేల హెక్టార్లకు గానూ ఇందులో నుంచి 20 శాతం కోర్, బఫర్ ఏరియాను మాత్రమే టూరిజం స్పాట్ కోసం కేటాయించారు. కడెం నుంచి మొదలుకొని గంగాపూర్, ఎక్బాల్‌పూర్, ఉడుంపూర్, మైసంపేట, లక్ష్మీపూర్, కల్వకుంట్ల, అకొండపేట్, దిమ్మదుర్తి తదితర ప్రాంతాల్లోని కోర్, బఫర్ ఏరియాల్లో గల 20శాతం ప్రాంతాన్ని ఇప్పటికే కేటాయించారు. దీని కోసం గానూ ఈ అటవీ గ్రామాలన్నింటినీ కలుపుతూ ప్రత్యేక రూట్‌మ్యాప్‌ను తయారు చేసి టూరిస్టుల కోసం రోడ్డును కూడా ఏర్పాటు చేశారు. దట్టమైన అడవుల గుండా ప్రయాణించేందు కోసం సఫారీ వాహనాలు కూడా సమకూరుస్తున్నారు. ఈ అడవుల్లో ఇప్పటికే గడ్డి మైదానాలను పెంచడంతో వన్యప్రాణుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అడవిలోని ప్రకృతి సౌందర్య దృశ్యాలతో పాటు నీటి కొలనులు, చిన్న చిన్న జలపాతాలు, మృగాలు టూరిస్టులను విపరీతంగా ఆకర్షించనున్నాయని అంటున్నారు. సఫారీ వాహనంలో టూరిస్టులు పర్యటించే సమయంలో వారికి అన్ని రకాల సౌకర్యాలతో పాటు భద్రత చర్యలు కూడా చేపట్టనున్నారు. అలాగే ఇక్కడి ఎత్తైన గుట్టపైకి వెళ్లి అక్కడ నిర్మించిన వాచ్ టవర్ ద్వారా కడెం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌తో పాటు కవ్వాల్ అభయారణ్యంను చూసే అవకాశాన్ని కల్పిస్తున్నారు.

పీపీపీ పద్దతుల్లో నిర్వహణ

ఏకో టూరిజంలో భాగంగా కవ్వాల్ టైగర్ జోన్‌ను టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఈ టూరిజం నిర్వహణ అంతా అటవీశాఖ పీపీపీ పద్దతిలో చేపట్టబోతోంది. టైగర్‌జోన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వీడీసీలు అలాగే ఇక్కడి యువకులు సఫారీ వాహనాల నిర్వహణను చేపట్టే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఈ వాహనాల కొనుగోలుకు సహకరించినప్పటికి స్థానిక యువకులకు రుణాలు అందించి ఈ వాహనాలు అప్పగించనున్నారు. గైడ్‌ల నియామకం కూడా స్థానికులకు అప్పగించనున్నారు. ఇక్కడి అడవి జంతువుల వివరాలు, చెట్ల రకాల ప్రత్యేకతలను టూరిస్టులకు స్థానిక యువకులు వివరించే అవకాశాం ఉండడంతో వారినే గైడ్‌లుగా నియమించనున్నారు. ఈ మొత్తం టూరిజం స్పాట్ పరిధిని పర్యవేక్షించే బాధ్యత అటవీశాఖ చేపట్టబోతోంది.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


కుంటాల మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

కుంటాల, జూలై, 13: మండల కేంద్రం కుంటాల స్థానిక మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రతీయేటా జూలై మాసంలో నిర్వహించే ఈ వార్షికోత్సవానికి మండలం నలుమూలల నుంచే కాకుండా ఆలయదాతలతో పాటు పలువురు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా శనివారం అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేకపూజలు నిర్వహించి వార్షికోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రోజు మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

మూడు ఆలయాల నిర్మాణానికి నిధుల మంజూరు


నిర్మాణంలో చివరిదశకు చేరుకున్న
భైంసా మండలం దేగాం గ్రామంలోని శ్రీదత్తఆలయం

భైంసా, జూలై 13 : నియోజకవర్గ పరిధిలో నిర్మాణ చివరిదశలోనున్న మూడు ఆలయాలకు నిధులు మంజూరయ్యాయని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తెలిపారు. శనివారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో విలేకరులకు నిధుల మంజూరి వివరాలను వెల్లడించారు. లోకేశ్వరం మండలం ఎడ్బూర్ గ్రామంలోని శ్రీ మహాదేవ్ ఆలయానికి రూ.18.36 లక్షలు, భైంసా మండలం దేగాం గ్రామంలోని శ్రీ దత్త మందిరానికి రూ.9.21 లక్షలు, ముథోల్ మండలం తరోడా గ్రామంలోని శ్రీ మహాలక్ష్మీ మందిరానికి రూ.1.44 లక్షల నిధులు మంజూరు అయినట్లుగా పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రివర్యులు కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు ముథోల్ నియోజక వర్గ ప్రజానీకం తరపున కృతజ్ఞతలు తెలిపారు. మంజూరైన నిధులు ఐదు రోజుల వ్యవధిలోగా సంబంధిత ఆలయాల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయబడుతాయని వివరించారు. ఇదే క్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లోనున్న ఇతర ఆలయాల నిర్మాణాల బిల్లులను త్వరితగతిన మంజూరి చేయించేందుకు చర్యలు చేపట్టినట్లుగా వెల్లడించారు

మొహర్రం ఉత్సవానికి ముస్తాబైన పీరీలు

లక్ష్మణచాంద, జూలై 13 : మండలంలోని మునిపెల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలకు పీరీలు (పంజాలు) సిద్ధం చేశారు. ఈ ఉత్సవాన్ని మండలంలోని మిగతా గ్రామాల్లో కంటే మునిపెల్లి గ్రామంలో వైభవంగా నిర్వహిస్తారు. తమ ప్రాంత ప్రజలను కాపాడటం కోసం పదవులతో పాటు ప్రాణాలను సమితం త్యాగం చేసిన ముస్లిం పాలకులైన ఇమామ్ హసన్, హిమామ్ హుస్సేన్‌ల స్మారకార్థం నిర్వహించే ఈ పండగలో హిందువులు, ముస్లింలు పాల్గొని మతసామరస్యం చాటే సంగతి అందరికీ తెలిసిందే. ఈ ఉత్సవ సందర్భంగా స్థానికంగా ఐదు రోజులపాటు అస్సైదులా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొహర్రం పర్వదినాన మునిపెల్లి గ్రామంలో జాతర కూడా కొనసాగుతుంది.

పరీక్షించకుండానే బంగారం నాసిరకమనడం సరికాదు

- ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న స్వర్ణకార సంఘం నాయకులు

ఖానాపూర్, జూలై 13 : ఓ స్వర్ణకారుడు చేసిన బంగారు ఆభరణాలను ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండానే ముత్తూట్ ఫైనాన్స్ నిర్వాహకులు నాసిరకం అనడం సరికాదని ఖానాపూర్ మండలం స్వర్ణకార సంఘం నాయకులన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఖానాపూర్‌కు చెందిన పెందోట కుమార్ అనే స్వర్ణకారుడి వద్ద కమ్మలు చేయించుకున్న ఓ మహిళ ఆ కమ్మలు తాకట్టు పెట్టి రుణం తీసుకునేందుకు ముత్తూట్ ఫైనాన్స్‌కు వచ్చిందన్నారు. ఫైనాన్స్ నిర్వాహకులు ఎటువంటి పరీక్షలు నిర్వహించకుండానే ఆ కమ్మలు బంగారం కావని తెలిపారని దీంతో ఆమె స్వర్ణకారుడి దుకాణం పైకి దాడికి వచ్చిందన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు చేసిన ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ రామును వివరణ కోరగా తాము ఎవరికి అలా చెప్పలేదన్నారు. 18 క్యారెట్ల బంగారంపై తమ ఫైనాన్స్ అప్పు ఇవ్వదని మాత్రమే చెప్పామన్నారు. తమ వద్ద పరీక్ష నిర్వహించేందుకు రబ్బర్ స్టోన్ పరికరం ఉంటుందన్నారు. స్వర్ణకార సంఘం నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం ముత్తూట్ ఫైనాన్స్ నిర్వాహకులపై స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు స్వర్ణకార సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు అధ్యక్షులు వెంకటేష్, చందు, బ్రహ్మం, నాగేంద్రబాబు, శేషాద్రి, నాగనాథ్, భీమేష్, తదితరులున్నారు.

ఆత్మహత్యా యత్నం చేస్తున్న
యువతిని రక్షించిన పోలీసులు

నిర్మల్ కల్చరల్, జూలై 13 : నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ చెరువులో ఆత్మహత్య యత్నానికి పాలడ్డ వివాహిత యువతిని బ్లూ కోటు పోలీసుసిబ్బంది శనివారం కాపాడినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు వెల్లడిస్తూ మహారాష్ట్ర బీదర్‌కు చెందిన యువతికి ఖానాపూర్‌కు చెందిన వెంకటేష్ అనే వ్యక్తితో ఇంసాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకున్నారని సీఐ తెలిపారు. మహాలక్ష్మివాడలో గల డబుల్ బెడ్ రూమ్‌లలో నివాసముంటున్న వీరిద్దరి మధ్య కలహాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఆ మహిళకు ఇదివరకే పెళ్లి అయి ముగ్గురు పిల్లలున్నారని అన్నారు. ఉదయం 10:30 గంటలకు పట్టణ పోలీసుస్టేషన్‌కు ఫోన్ చేసి ఓ మహిళా ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు సమాచారం రావడంతో అప్రమత్తమైన బ్లూకోర్టు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మహిళను కాపాడి పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. కుటుంబ సభ్యులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించినట్లు తెలిపారు. డీఎస్పీ గంగారెడ్డి, బ్లూకోర్టు పోలీసు సిబ్బందితో పాటు సీఐ ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

మొక్కలు నాటి సంరక్షించండి : చైర్మన్ ఈశ్వర్



నిర్మల్ కల్చరల్, జూలై 13 : ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ జి.ఈశ్వర్ కోరారు. ప్రియదర్శిని నగర్‌లోని విజేత స్కూల్‌లో ఆయన శనివారం మొక్కలు నాటారు. బాధ్యతగా స్వీకరించి మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణకు దోహద మవుతుందన్నారు. ప్రాణవాయువు లభిస్తుందన్నారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గుతున్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి నిల్వలు

- 0.704 టీఎంసీల నుంచి 0.676 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వలు
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

భైంసా, జూలై 13 : వరుణదేవుని కరుణ లేక గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెలన్నర రోజుల కాలం గడుస్తున్నా ఇక్కడి ప్రాంతంలో ఇప్పటి వరకు చెప్పుకోతగ్గ రీతిలో వర్షాలు కురియలేదు. దీంతో గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికి వరద నీటి చేరిక జరుగలేదు. దీనికి తోడు ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రతికూల పరిస్థితులతో ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం వరినాట్లు వేసే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. నాట్లు వేయాల వద్దా అనే మీమాంసలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. బోరుబావుల కింద సాగు చేసే వారు నాట్లు వేస్తుండగా ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం మాత్రం ఏమి చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు.


గడ్డెన్నవాగు ప్రాజెక్టు

● 0.676 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వలు

ఇన్‌ఫ్లో లేకపోవడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నెల అరంభంలో ప్రాజెక్టులో నీటి నిల్వలు 0.704 టీఎంసీలు ఉండగా శనివారం నాటికి నీటినిల్వలు 0.028 టీఎంసీలు తగ్గి 0.676 టీఎంసీలకు పడిపోయాయి. ఈ నెల ఆరంభంలో 355.8 మీటర్లుగానున్న ప్రాజెక్టు నీటి మట్టం ప్రస్తుతం 0.1 మీటర్లు తగ్గి 355.7 మీటర్లకు పడిపోయింది. ప్రాజెక్టు నీటినిల్వల నుంచి మిషన్ భగీరథకు రోజు 20 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా గేట్ల నుంచి లీకేజీరూపంలో రోజు 20 క్యూసెక్కులకు పైగానే వృధాగా పోతున్నట్లు సమాచారం. అంతేకాకుండా అవిరిరూపంలో కూడా నీటినిల్వలు తగ్గుతున్నట్లుగా తెలిసింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా నీటి సామర్థ్యం 1.852 టీఎంసీలుగా ఉంది.

● గత ఏడాది ఇదే సమయంలో 0.849 టీఎంసీల నీటి నిల్వలు

గత సంవత్సరం జూలై మాసం రెండవ వారం ఆరంభం నుంచి ప్రాజెక్టులోకి వరద నీటిచేరిక మొదలయ్యింది. ఇదే సమయంలో గత సంవత్సరం ప్రాజెక్టులోకి 1500 క్యూసెక్కుల వరద నీటి చేరిక జరుగగా ప్రాజెక్టు నీటి మట్టం 356.3 మీటర్లు ఉండగా నీటినిల్వలు 0.849 టీఎంసీలు ఉన్నాయి. గత సంవత్సరంతో పోల్చి చూస్తే ప్రస్తుతం ప్రాజెక్టులో 0.173 టీఎంసీల నీటి నిల్వలు తక్కువగానున్నాయి.

● అయోమయంలో ఆయకట్టు రైతాంగం

ప్రతికూల పరిస్థితులతో ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం అయోమయానికి గురవుతోంది. వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్టు నీటి మట్టం తగ్గుముఖం పడుతుండటంతో నాట్లు వేసే విషయంలో ఆందోళన చెందుతోంది. వర్షాకాలంలో ఆయకట్టు కింద 10 వేలకు పైగా ఎకరాల్లో వరిసాగు అవుతుండేది. నాట్లు వేసే సమయానికి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు సాగు నీరు అందేది. ప్రస్తుతం ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నారుమడులు సిద్దంగా ఉన్నప్పటికి నాట్లు వేసే విషయంలో రైతులు ఆలోచనలోపడ్డారు. కొద్ది సమయం వరకు వేచి పరిస్థితులు అనుకూలంగా మారితే నాట్లు వేయడం లేకుంటే మిన్నకుండి పోవడమే మేలనే స్థితికి ఆయకట్టు రైతాంగం చేరుకుంది.

కరెంటు కోతలపై సుర్జాపూర్‌కు చెందిన రైతు వినూత్న నిరసన

- ఖానాపూర్ - మెట్‌పల్లి రహదారిపై సుర్జాపూర్ వద్ద రోడ్డుకు అడ్డంగా వరి మొలక పోసి ఆందోళన
- ఉదయం నుంచి కరెంటు లేకపోవడంతో వరి మొలక ఆరిపోతోందని రైతు ఆవేదన


రోడ్డుపై ధాన్యం మొలకను అడ్డుగా పోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు


రహదారిపై బైఠాయించిన రమేష్‌ను పక్కకు తరలిస్తున్న పోలీసులు

ఖానాపూర్, జూలై 13 : కరెంటు కోతలపై సుర్జాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు వినూత్న నిరసన చేపట్టాడు. తాను సిద్ధం చేసుకున్న వరి మొలక ఆరిపోతుందనే ఆవేదనతో శనివారం వరి ధాన్యం మొలకను తెచ్చి సుర్జాపూర్ వద్ద ఖానాపూర్ - మెట్‌పల్లి రోడ్డుపై అడ్డంగా పోసి నిరసన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే సుర్జాపూర్ గ్రామానికి చెందిన రైతు తునికి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... తన పొలంలో నారుమడి కోసం రమేష్ గత మూడు రోజుల క్రితం వరి ధాన్యాన్ని మొలక పోశాడు. ఆ ధాన్యం కాస్త శనివారం నిండుగా మొలక రావడంతో బురదమడిని సిద్ధం చేసుకుని మొలక అలికేందుకు సన్నద్ధమయ్యాడు. ఇందుకోసం నిండుగా వచ్చిన మొలకను విడిగా విచ్చుకొని సిద్ధం చేసుకున్నాడు. తీరా మొలక సిద్ధమయ్యేసరికి కరెంటు లేకపోవడంతో బురదమడికి నీరు లేక విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాడు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు వస్తుందని అధికారులు చెప్పారని రమేష్ పేర్కొన్నాడు. మధ్యాహ్నం మూడు గంటలు దాటిన కరెంటు రాకపోవడంతో తాను బురద మడిలో అలికేందుకు సిద్ధం చేసుకున్న ధాన్యం మొలకంతా ఆరిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో కరెంటు కోతలు నిరసిస్తూ రోడ్డుపై ధాన్యం మొలకను అడ్డంగా పోసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ప్రారంభిస్తామని చెప్పి అధికారులు నాలుగు గంటల వరకు సైతం కరెంటు సరఫరాను ఇవ్వకపోవడం పట్ల మండలంలోని పలు రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం వరి పొలాల కోసం నారుమడులు సిద్ధం చేసుకునే సమయమని, మరి కొంతమంది నాట్లు వేసేందుకు బురద మడులను సిద్ధం చేసుకుంటున్నారని ఈ సమయంలో ఇష్టారాజ్యంగా కరెంటు కోతలు విధించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు రమేష్‌ను స్థానిక పోలీసులు సముదాయించడంతో ఆయన ఆందోళన విరమించాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో తనకు సుమారు రూ. 10 వేల వరకు నష్టం జరిగిందని, పై పెచ్చు నారు పోసుకునే ఎప్పం సైతం దాటి పోతుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలని రమేష్‌తో పాటు మండల రైతాంగం కోరుతోంది.

సంక్షిప్త సమాచారం

పోలీసు తనిఖీల్లో 50 ద్విచక్ర వాహనాల పట్టివేత


తనిఖీలు చేస్తున్న పోలీసులు

నిర్మల్ కల్చరల్, జూలై 13 : జిల్లా కేంద్రంలో ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మూడుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 50 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జైశంకర్‌చౌరస్తా, శివాజీచౌక్, బస్టాండ్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సారంగాపూర్, జూలై 13 : మండలంలోని చించోలి (బి) ఎక్స్ రోడ్డు వద్ద శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వాహనాలకు ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాహనాలతో పాటు నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను పట్టుకొని జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ప్రతి ఒక్కరూ వాహనాల ధ్రువపత్రాలు కలిగి ఉండి, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వాహన చోదకులతో పేర్కొన్నారు.

సర్వీస్ రూల్స్ కోసం కృషి చేస్తాం

నిర్మల్ కల్చరల్, జూలై 13 : వచ్చే రెండు నెలల్లో ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ సాధించేందుకు కృషి చేస్తామని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్ల యూనియన్ అధ్యక్షుడు టి.నరేంద్రబాబు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండల విద్యాధికారులు, జూనియర్, డైట్ లెక్చరర్లు, ఉప విద్యాధికారుల పోస్టులను, పదోన్నతులు భర్తీ చేయిస్తామన్నారు. బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, పాఠశాలల్లో స్కావెంజర్‌లను నియమించాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ సేవలు అభినందనీయం

నిర్మల్ కల్చరల్, జూలై 13 : సోన్ మండల పరిషత్ తాజా మాజీ అధ్యక్షురాలు మానస హరీష్‌రెడ్డి గత ఐదేళ్లుగా అందించిన సేవలు అభినందనీయమని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వి.శోభారాణి, సత్యనారాయణగౌడ్ అన్నారు. శనివారం వారి నివాసంలో సన్మానించారు. ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. లక్ష్మణచాంద మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, సోన్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు నర్సయ్య, నరేష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.